రామతీర్థం ప్రగతిబాట!

- రూ.1.32 కోట్లతో అభివృద్ధి పనులు
- పట్టణాన్ని తలపిస్తున్న పల్లెటూరు
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

బనగానపల్లెరూరల్: మండల పరిధిలోని రామతీర్థం గ్రామం ప్రగతిబాట పట్టింది. గతంలో ఫ్యాక్షన్ నేపథ్యంలో అభివృద్ధికి ఆమడదూరం అన్నట్లుగా ఉన్న ఈ గ్రామం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేడు పట్టణాన్ని తలపిస్తుంది. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. గ్రామాభివృద్ధికి దాదాపు రూ.1.32కోట్లు మంజూరు చేయించారు కాటసాని. ఈ మేరకు చేపట్టిన అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయి. రూ. 35 లక్షలతో సచివాలయ భవనం, 21.80లక్షలతో రైతుభరోసా కేంద్రం, 17.50 లక్షలు వెచ్చించి నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. అదేవిధంగా జల్‌జీవన్ పథకం రూ.27.08 లక్షలతో ఇంటింటికీ కుళాయి, మరో రూ.36 లక్షలతో ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మాణాలు పూర్తి చేయడంతో ఏళ్లతరబడి నెలకొన్న నీటి సమస్య తీరింది. ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతుల కల్పనతో పట్టణాన్ని తలపిస్తుందని రామతీర్థం గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కాటసాని తోపాటు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు స్థానికులు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు చర్యలు తీసుకునట్లు పంచాయతీ రాజ్ ఏఈ వెంకటరమణ తెలిపారు.



రూ.17.50లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్


రూ.21.50లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం


35లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం


రూ.27.08లక్షలతో జల్‌జీవన్ పథకం ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేసిన దృశ్యం

క్లుప్తంగా

మంగపల్లెలో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రజలు

సంజామల: మండల పరిధిలోని మంగపల్లెలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామవాసి నంద్యాల గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత దస్తగిరి రెడ్డి ఆర్థిక సాయంతో ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు డాక్టర్లు రోగులకు బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులు, గుండె సంబంధిత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు మౌలాలి రెడ్డి, షేక్షావలి రెడ్డి పాల్గొన్నారు.

2న మెగా రక్తదాన శిబిరం

బనగానపల్లె: ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు దివంగత కాటసాని నాగార్జున రెడ్డి జయంతి సందర్భంగా ఆగస్టు 2న మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని అవుకు రోడ్డులో ఉన్న నాగార్జునరెడ్డి ఘాట్ వద్ద ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నాయకులు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదంగావించాలని ఆయన కోరారు.

అనాథ వృద్ధుడికి సపర్యలు


వృద్ధుడికి స్నానం చేయిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : పట్టణంలో యాచించుకుంటూ జీవనం సాగించే కర్ణాటక రాష్ట్రానికి చెందిన గురునాథం అనే వృద్ధునికి ఆదివారం స్ఫూర్తి సేవా సమితి సభ్యులు సపర్యలు చేశారు. పట్టణంలోని బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద అస్వస్థతకు గురై అచేతనంగా పడి ఉన్న గురునాథాన్ని గమనించిన స్థానికులు స్ఫూర్తి సభ్యులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన సభ్యులు సీసంగుంతల మధు, రాము, అంజి యాదవ్, ఆటో మధు ముందుగా వృద్ధుడికి అల్పాహారం అందజేశారు. దుర్వాసన వస్తుండడంతో స్నానం చేయించి దుస్తులు మార్చి మానవత్వం చాటుకున్నారు.

పోతుదొడ్డిలో ముగిసిన మొహర్రం


పీర్ల దేవుళ్ల గ్రామోత్సవ దృశ్యం

ప్యాపిలి: మండల పరిధిలోని పోతుదొడ్డిలో మొహర్రం వేడుకలు ఆదివారం ముగిశాయి. ఆదివారం పీర్ల నిమజ్జనం సందర్భంగా గ్రామ పురవీధుల మీదుగా ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా పెద్దలాల్ స్వామి పీర్ల స్వాములను దారిపొడవునా కులమతాలకు అతీతంగా ప్రజలు చదివింపులు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న పురాతన బావి వద్ద పీర్లను ప్రక్షాళన చేశారు.

మాలమహానాడు నూతన కార్యవర్గం ఎన్నిక

డోన్: పట్టణ మాలమహానాడు నూతన కార్యవర్గం ఏర్పడింది. స్థానిక కార్యాలయంలో సీనియర్ న్యాయవాది కడిమెట్ల నారాయణ ఆధ్వర్యంలో ఆదివారం సభ్యులు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షునిగా రైల్వేనాగేంద్ర, ఉపాధ్యక్షునిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్, సహాయ కార్యదర్శిగా భరణి మారుతి, కోశాధికారిగా రమణమూర్తిని ఎన్నుకున్నట్లు న్యాయవాది కడిమెట్ల నారాయణ తెలిపారు.

ఇంటర్‌లో మిగిలిన సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లను పదవ తరగతి మార్కుల ఆధారంగా విద్యార్థినులను భర్తీ చేస్తున్నామన్నారు. ఓసీ, బీసీ, ఎస్టీ కేటగిరిల్లో ఒక్కో సీటు, ఎస్సీ కేటగిరిలో ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది మార్చిలో పదవ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థినీలు మాత్రమే అర్హులన్నారు. ప్రవేశాల కోసం విద్యార్థినులు సోమవారం ఉదయం 11 గంటలకు కళాశాలలో ఐదు పాస్‌పోర్టుసైజు ఫొటోలు, ధ్రువీకరణ పత్రాలు, తల్లి బ్యాంకు ఖాతా జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షించాలి


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

ప్యాపిలి: పోలీసులు శాంతి భద్రతలు పరిరక్షించాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్‌లో నమోదైన కేసులు, వాటి పరిష్కారాలను ఆయన సీఐ శ్రీరాములు, ఎస్‌ఐ సీఎం రాకేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపేక్షించరాదన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించిన బాధితులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ ద్వారానే ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు


మాట్లాడుతున్న ఎస్‌ఐ నరేంద్రకుమార్

అవుకు: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేంద్రకుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం అవుకు పట్టణంలోని మటన్ దుకాణాల నిర్వాహకులతో సమాశమైన ఎస్‌ఐ ప్రతి బుధ, ఆదివారం బస్టాండ్, మార్కెట్ వీధి, మున్నా మార్కెట్ వద్ద ట్రాఫిక్ సమస్య ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్న వియాన్ని గుర్తుంచుకోవాలన్నారు. తోపుడు బండ్లపై రోడ్లపైనే మటన్ విక్రయిస్తున్నందున ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, గ్రామ పంచాయతీ అధికారులు నిర్దేశించిన స్థలంలోనే అమ్మకాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా మెట్టుపల్లె రస్తాలో ఫాస్ట్‌ఫుడ్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రాజేష్

డోన్ టౌన్ : చిన్నతనం నుంచి విద్యార్థులకు ఇతిహాసాల గురించి తెలియజేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్,టీటీడీ హిందూ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి సూచించారు. తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఒక ప్రైవేట్ స్కూల్లో నిర్వహించిన కథ చెబుతారా..ఊ కొడుతారా కార్యక్రమానికి వారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 10 ,15 సంవత్సరాల లోపు విద్యార్థులకు కథల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేసి సత్కరించారు. న్యాయ నిర్ణేతలుగా తొగట సురేష్‌బాబు, సర్వజ్ఞమూర్తి, దేవేంద్ర, సుబ్రహ్మణ్యంశెట్టి, నీలిమా, సీతాలక్ష్మి వ్యవహరించారు.

మణిపూర్ దోషులను కఠినంగా శిక్షించాలి


పెట్రోల్ బంకు సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

బనగానపల్లెరూరల్ : మణిపూర్‌లో జరిగిన మారణహోమానికి బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బనగానపల్లె జమా అతే ఇస్లామిక్ హింద్, సీఐఎస్ టౌన్ చర్చి, ఆర్‌సీఎం చర్చి, క్రైస్తవ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఎస్‌ఐ టౌన్ చర్చి, ఖాన్ రైస్‌మిల్, కూరగాయాల మార్కెట్, పాతబస్టాండ్, ఆస్థానం రోడ్డు మీదుగా పెట్రోల్ బంకు సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. ఆయా సంఘాల పెద్దలు మాట్లాడుతూ మణిపూర్‌లో హింసాకాండపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంతవరకు స్పందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో జమా అతే ఇస్లామిక్‌హింద్ స్థానిక అధ్యక్షుడు మీర్జా అలీబేగ్, ఫాదర్ రమేష్, ఆల్బర్ట్, మనోజ్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక.. జియారత్ !

- నేటి నుంచి దస్తగిరి, మౌలాలి స్వామి జార్తలు
- పీర్లదేవుళ్లు ముస్తాబు... రెండు రోజులపాటు సాగనున్న వేడులు


దస్తగిరి స్వామి పీరు


మౌలాలి స్వామి పీరు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామంలో మొహర్రం పండుగను పురస్కరించుకుని మత సామరస్యానికి ప్రతీకగా ప్రతిఏటా జియారత్ వేడుకలు నిర్వహిస్తున్నారు. మొహర్రం ముగిసిన మూడవ రోజున ఈ వేడుకలను జరుపడం ఆనవాయితీ. శనివారం మొహర్రం పండుగ ముగియగా పీర్ల నిమజ్జన మూడవ రోజైన సోమవారం నుంచి గ్రామంలో వెలసిన దస్తగిరిస్వామి, మౌలాలి స్వామి దర్గాల్లో స్వామివార్ల జియారత్ వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండు రోజులపాటు జార్తలను వైభవంగా జరిపేందుకు దర్గా కమిటీ సభ్యులు తీర్మానం చేశారు. కోరిన కోర్కెలు తీరుస్తూ భక్తుల పాలిట ఆరాధ్యులుగా పేరుగాంచిన దస్తగిరి స్వామి, మౌలాలిస్వామి పీర్లకు ప్రత్యేక చరిత్ర ఉంది.

దస్తగిరిస్వామి పీరుకు ప్రత్యేక చరిత్ర

పూర్వీకుల కథనం మేరకు కోడి కూత, రోకలిపోటు వినిపించని సమయంలో గ్రామానికి చెందిన మాబుసాని అనే భక్తుడు చేతిలో నిప్పులు పోసుకుని వెండిని కరిగించగా ఆచారి అనే మరో భక్తుడు దస్తగిరి స్వామి పీరును తయారు చేశారని నానుడి. అనేక మహిమలు ఉన్న స్వామికి ప్రతిఏటా భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటుంటారు. స్వామి మహిమలు తెలుసుకున్న ఒక దొంగల ముఠా పీరును దొంగలించి నొస్సం కొండల్లో వెండిని కరిగించేందుకు ప్రయత్నించగా వారి కళ్లు పోవడంతో పీరును అక్కడే వదిలేసి పారిపోరినట్లు చరిత్ర. నొస్సం కొండల్లో పీరు ఉందని వెంటనే వెళ్లి తీసుకుని వచ్చి దర్గాలో ప్రతిష్ఠించాలని దస్తగిరిస్వామి మాబుసానికి కలలో కనిపించి చెప్పారు. ఈ మేరకు భక్తులు అక్కడికి చేరుకుని పీరును తీసుకొచ్చి తిరిగి ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా నిర్వహించే జియారత్ వేడుకలకు ప్రాధాన్యత సంతరించుకుంది. స్వామి మహిమలకు ఆకర్షితులైన అప్పటి భక్తులు పలగాటి ఉశేని, కొర్ర తిరుపాలు, తెలుగు లక్ష్మన్న, దూదెకుల బుడ్డన్న విరాళాలు సేకరించి స్వామి వారికి ప్రత్యేకంగా దర్గా నిర్మించారు. అనంతరం కొంత కాలానికి మౌలాలి స్వామి పీరును తయారు చేసి మాబుసాని వంశస్తుల ఆధ్వర్యంలో జార్తలను నిర్వహిస్తున్నారు.

రెండు రోజులపాటు జార్తలు

గ్రామంలో సోమవారం నుంచి జరిగే జార్తల్లో భాగంగా ఉదయం మాబుసాని సమాధి, దస్తగిరిస్వామి, మౌలాలి స్వామి పీర్లకు ఫాతెహాలు సమర్పిస్తారు. భక్తులు పూలదట్టీలు, వెండిగొడుగులు, పూల దండలతో ఊరేగింపుగా తీసుకొని వచ్చి స్వామి వార్లకు అలంకరిస్తారు. మధ్యాహ్నం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కందూరు నిర్వహించనున్నారు. అదే రోజు అర్థరాత్రి నుంచి స్వామి వార్ల ఊరేగింపు ప్రారంభమై మంగళవారం సాయంత్రం వరకు కొనసాగనుంది. ఊరేగింపు అనంతరం పీర్ల దేవుళ్లను చావిళ్లలో కొలువుంచడంతో జార్తలు ముగుస్తాయి. జిహారత్ వేడుకలకు ఉమ్మడి కర్నూలు జిల్లాతోపాటు వైఎస్‌ఆర్ జిల్లా జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, అనంతపురం, తాడిపత్రి, హైదరాబాదు తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి దస్తగిరిస్వామి, మౌలాలి స్వామిని దర్శించుకుని పూలదట్టీలు, వెండిగొడుగులు సమర్పిస్తారు.

స్వచ్ఛంద సేవలకు సంపూర్ణ సహకారం


మాట్లాడుతున్న ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: మానవతా స్వచ్ఛంద సంస్థకు తమవంతు సహాయ, సహకారాలు అందిస్తామని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఆదివారం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో మానవతా స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి జెడ్పీ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్లలో ఏర్పాటు చేసిన ఆ శాఖకు తమ తండ్రి దివంగత ఎర్రబోతుల వెంకటరెడ్డి రూ.7లక్షలతో అంబులెన్స్‌ను విరాళంగా ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తమ సంస్థకు గతంలో దివంగత ఎర్రబోతుల వెంకటరెడ్డి గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించిన విషయాన్ని గుర్తు చేసిన రామచంద్రారెడ్డి ఆయన స్థానాన్ని భర్తీ చేసి మళ్లీ కార్యకలాపాలు కొనసాగించాలని జెడ్పీ చైర్మన్‌ను కోరడంతో అంగీకరించారు. కొలిమిగుండ్ల యూనిట్ బాధ్యతలను లాయర్ మహేశ్వరరెడ్డి స్వీకరించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు పేరం బయ్యపురెడ్డి, వైపీఎస్ నారాయణరెడ్డి, రమణారెడ్డి, సుబ్బరాయుడు, గువ్వల వెంకటేశ్వరరెడ్డి, శివయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మొహర్రం


ఆకుమళ్లలో పీర్ల ఊరేగింపు దృశ్యం

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో మొహర్రం వేడుకలు ఆదివారం ముగిశాయి. సాయంత్రం భక్తి శ్రద్ధలతో సాగిన పీర్ల ఊరేగింపులో యువకులు లయబద్ధంగా చేసిన నృత్యాలు, విచిత్ర వేశధారణలు ఆకట్టుకున్నాయి. అనంతరం పీర్లను జలధి (షహదత్) చేశారు. అనంతరం పీర్లను ప్రత్యేక పెట్టెల్లో భద్రపరిచారు.ఈ సందర్భంగా పీర్ల నిర్వహకులు శోక గీతాలు ఆలపించారు.

అ'పూర్వ' సమ్మేళనం

- 40 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు
- గురువులకు ఘన సత్కారం


ఆనాటి గురువు శతావధాని గండ్లూరి దత్తాత్రేయశర్మను సత్కరిస్తున్న దశ్యం

డోన్: స్థానిక ఎస్‌కేపీ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (1982 టెన్త్ బ్యాచ్) సమ్మేళనం ఆదివారం స్థానిక షాధిఖానాలో అపురూపంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులుగా, వ్యాపారులుగా, స్థానికంగా రాజకీయరంగంలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు దాదాపు నలభైఏళ్ల తర్వాత కలుసుకుని కేరింతలు కొట్టారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుని యోగక్షేమాలపై ఆరా తీసుకున్నారు. ఎంతో సరదాగా గడిచిన బాల్యస్మృతులను నెమరేసుకున్నారు. 1982 సంవత్సరంలో ఎస్‌కెపి ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం స్థానిక షాధిఖానాలో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. 40 ఏళ్ల తర్వాత 1982 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒకచోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. చిన్ననాటి చిలిపి చేష్టలు, తోటి విద్యార్థులతో పాటు మాస్టార్లను ఆటపట్టించిన వైనం గురించి పాఠశాలలు ఎగ్గొట్టి సినిమాలు, వంకలు, వాగుల్లో ఈతకు వెళ్లిన సందర్భాలను తిరిగి వారు పరస్పరం నెమరు వేసుకున్నారు. ఎంతో సరదాగా గడిచిన బాల్య స్మృతులను వారు నెమరు వేసుకోవడం కనిపించింది.

గురువులకు సత్కారం

అలనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, రామ్మోహన్, చంద్రమోహన్, బ్రహ్మానందం, నాగరాజు, తాజుద్దీన్, మౌళాలి, ప్రతాప్‌నాయుడు, సుబ్బరాయుడు, ప్రసాద్ రామ్‌ను పూర్వవిద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులపై పూలవర్షం కురిపిస్తూ వేదికపైకి ఆత్మీయ స్వాగతం పలికారు. గురువులకు శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం ఈ వేదిక ఏర్పాటుకు కృషి చేసిన క్వాలిటీ రహిమాన్, ఆలా శ్రీధర్, రహిమాన్, సముద్రాల బాబు, శంకర్, సుబ్రమణ్యం, సంగాల వెంకు, శివుడు, జగన్ తదితరులను తోటి పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఓ తియ్యటి అనుభూతి



నలభైఏళ్ల తర్వాత చిననాటి స్నేహితులను కలుసుకోవడం ఓ తియ్యటి అనుభూతి. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్నేహితులు ఒకే వేదికపై కలువడం మరువలేని అనుభూతి. ఈ సంతోషం ఎందులోనూ దొరకదు. అదికూడా గురువులను సత్కరించడం చాలా సంతోషంగా ఉంది. అందరికీ కృతజ్ఞతలు. – కోట్రికె హరికిషన్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్‌చైర్మన్

అంతులేని ఆనందం



ఊహ తెలియని వయసులో కలిసి చదువుకున్న వారందరం 40 ఏళ్ల తర్వాత ఒక్కచోటికి చేరడం అంతులేని ఆనందాన్నిచ్చింది. మేము ఎంత బిజీలో ఉన్నా పాత స్నేహితులు కలుస్తున్నారంటే అన్ని పక్కనపెట్టి ఇక్కడికి వచ్చా. అంతులేని ఆనందాన్ని కలిగించింది. ఒక్కడెక్కడో స్థిరపడిని స్నేహితులు కలిసిన ఈ వేదిక జీవితాంతం గుర్తుంటుంది. ఈ సంతోషం ఓ తీపి గుర్తు –శ్రీనివాసులు, డీఎస్పీ ధర్మవరం, అనంతపురం జిల్లా

మహా ధర్నాను జయ ప్రదం చేయండి

డోన్ టౌన్ : కడప ఉక్కు పరిశ్రమ సాధనకు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం చేపట్టనున్న మహా ధర్నాను జయ ప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ, మండల కార్యదర్శులు నక్కి శ్రీకాంత్, కొయిలకొండ నాగరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మహా ధర్నాకు సంబంధించిన కర పత్రాలను విడుదల చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, నాగన్న, నాగమద్దయ్య, షమీమ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: కడప ఉక్కు పరిశ్రమ సాధనకు ప్రతిఒక్కరూ ఉద్యమించాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శిలు వెంకటేశ్వర్లు, ఈశ్వరయ్య, సీనియర్ నాయకులు ఎల్లయ్య, సాధిక్ హుసేన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామన్న హామీని బీజేపీ తుంగలో తొక్కిందని, పార్లమెంట్ ఇటీవలన చేసిన ప్రకటనతో ఆ విషయం స్పష్టమైందన్నారు.

సన్మానం

డోన్ టౌన్ : ఆర్టీసీ డిపోలో సెక్యూర్టీ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ కర్నూలు2 డిపో కు బదిలీపై వెళ్తున్న కేబీ కుమార్‌ను ఆదివారం సిబ్బంది, కార్మికులు ఘనంగా సత్కరించారు. స్థానిక డిపోలో హెడ్ కానిస్టేబుల్ రామమద్దయ్య ఆధ్వర్యంలో కేబీ కుమార్‌కు కార్మికులతోపాటు ఆర్టీసీ ఎంప్లాయిస్, నేషనల్ మజ్దూ ర్ యూనియన్ నాయకులు శాలువాలు కప్పిపూలమాలలతోసత్కరించి వీడ్కోలు పలికారు.

క్రైం కార్నర్

బొలెరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన కమలాకర్

అవుకు: మండల పరిధిలోని లింగంబోడు మెట్ట వద్ద బొలెరో క్యాంపర్ వాహనం ఢీకొని ఆదివారం వ్యక్తి మతి చెందారు. పోలీసుల వివరాల మేరకు లింగంబోడు గ్రామానికి చెందిన తలారి కమలాకర్ (29) రాళ్ల కొత్తూరు గ్రామంలో జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మేరకు వేకువ జామున విధులకు మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మెట్ట వద్ద తాడి పత్రి వైపు వెళ్తున్న బొలోరో వాహనం ఢీకొట్టడంతో కమలాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ నరేంద్ర కుమార్ తెలిపారు. మృతునికి కూతురు, కుమారుడు సంతానం.

జీవితంపై విరక్తితోనే ఆత్మహత్య

సంజామల: మండల పరిధిలోని ఎగ్గొని గ్రామానికి చెందిన సంజీవ(42) శనివారం రాత్రి విషపూరిత గులికలు మింగి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కుటుంబ పోషన భారమై జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలి చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఆయన వివరించారు.

కండక్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం

బేతంచెర్ల: పట్టణంలో నివాసం ఉంటూ బనగానపల్లె ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న ముల్ల నూర్ అహ్మద్ శనివారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. సమాచారం తెలుసుకున్న బనగానపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్ రవి కిశోర్ ఆదివారం నూర్ అహ్మద్ భౌతిక కాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల కోసం రూ.15 వేలను అందజేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది ప్రసాద్ రెడ్డి, సీఆర్ పుల్లయ్య, డీఎం బాషా పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. ఏడుగురు వ్యక్తు లు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందటంతో దాడి చేశామన్నారు. వారి నుంచి పేకముక్కలు, రూ. 9,400 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బనగానపల్లెరూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని కైప గ్రామానికి చెందిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి ఆదివారం తెలిపారు. ఇంటి ఎదుట స్థలంలో మురుగు నీటి విషయంలో ఘర్షణ జరిగిందన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నివాళి

కోవెలకుంట్ల: దివంగత ఎమ్మెల్సీ చల్లా భగీరథ్ రెడ్డి కుటుంబానికి ముఖ్య అనుచరుడిగా ఉన్న మండలంలోని బిజనవేముల గ్రామానికి చెందిన స్వర్ణ పెద్ద సుబ్బరాయుడు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అవుకు జెడ్పీటీసీ చల్లా శ్రీలక్ష్మి, చల్లా చైతన్యరెడ్డి, చల్లా చరణ్‌రెడ్డి గ్రామాన్ని చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.